క్లుప్తంగా

పుత్తూరు గంగ జాతర పోస్టర్ల ఆవిష్కరణ


జాతర పోస్టర్లు ఆవిష్కరణ

పుత్తూరు: గంగమ్మ జాతరను సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహిస్తున్నట్టు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం గంగమ్మ జాతర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27 ఉదయం గ్రామదేవత ఆరేటమ్మకు పాలాభిషేకం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. అదేరోజు రాత్రి గంగ జాతర చాటింపు ఉంటుందన్నారు. సెప్టెంబర్ 1 నుంచి గెరిగ పట్టణ పురవీధుల్లో తిరుగుతుందని వివరించారు.

టైలర్లు ఐకమత్యంగా ఉండాలి


నగరి టైలర్ యూనియన్ సభ్యులకు సన్మానం

నగరి: టైలర్స్ యూనియన్ ఐకమత్యంగా ఉండాలని టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ చాన్‌బాషా తెలిపారు. ఆదివారం నగరిలో టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమాపతి ఆధ్వర్యంలో కార్యనిర్వాహక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాన్‌బాషా మాట్లాడుతూ అప్పుడప్పుడు టైలర్ యూనియన్ సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యలను చర్చించుకోవాలన్నారు. నగరి యూనియన్ పేరు, అభివృద్ధి రాష్ట్రస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం నగరి టైలర్ యూనియన్ సభ్యులను దుశ్శాలువాలతో సన్మానించి, ఉచితంగా కత్తెర అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి టి.వీరయ్య, ఉపాధ్యక్షుడు ఎస్.నాగూర్ బాషా, ప్రధాన సలహాదారు పి.రాజేంద్రన్, కార్వేటినగరం అధ్యక్షుడు కె.దామోదరం, శ్రీకాళహస్తి డైరెక్టర్ జి.రేవతి, పుత్తూరు ప్రెసిడెంట్ ఎల్.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నూతన కార్యవర్గం


యాదవ ఎంప్లాయిస్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు

గంగాధరనెల్లూరు: యాదవ ఎంప్లాయిస్ సొసైటీ నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ఈ కార్యవర్గం ఎన్నిక గంగాధరనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యయాదవ్, దేవరాజులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీ ప్రకాష్ యాదవ్, ఉపాధ్యక్షులుగా భూషణ్ యాదవ్, శేషాద్రి యాదవ్, సుబ్రహ్మణ్య యాదవ్, కోశాధికారిగా భాస్కర్ యాదవ్, మహిళా కార్యదర్శిగా హంస, కార్యదర్శులుగా కుమారి, జ్యోత్స్న, రవి, సోము, యశ్వంత్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని యాదవులంతా ఐక్యంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని బ్రాహ్మణ వీధిలో వెలసి ఉన్న శ్రీ షిరిడీ సాయినాధుని ఆలయంలో 16వ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయ 16వ వార్షికోత్సవం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ ఆవరణలో వెయ్యి మందికి అన్నదానం చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రత్యేక పూజలతో పాటు, కుంకుమార్చన చేపడుతామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు


పేకాట రాయుళ్లను అరెస్టు చూపుతున్న సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం: తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. ఎస్‌ఐ కార్యాలయ ఆవరణలో ఆదివారం పేకాట రాయళ్లను అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తమిళనాడుకు సరిహద్దుల్లో కొల్లాగుంట బ్రిడ్జి సమీపంలోని మామిడి తోపులో పేకాటాడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.37,830 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, గంజాయి, బెల్టు షాపులు, సారా తయారీ, అమ్మకాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ మునికృష్ణ, ఇంటెలిజెన్స్ సిబ్బంది తారక్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు కావాలి. డ్యూటీలో ఉన్న పోలీస్‌పై చేయి చేసుకొంటే ఎంత నేరమో, అదే విధంగా డ్యూటీ డాక్టర్లపై దాడి చేసినా, అమర్యాదగా నడుచుకున్నా వారిని కఠినంగా శిక్షించాలి. ఇందుకోసం ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావాలి. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అలాగే పోలీస్ సెక్యూరిటీని కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విధుల్లో ఉండే డాక్టర్లకు ప్రత్యేక వసతులు కల్పించాలి.

- డాక్టర్ పి.ధనుష్, ఎన్‌సీడీ మెడికల్ ఆఫీసర్, పుత్తూరు



డాక్టర్లపై దాడులను అరికట్టాలి



ప్రతి డాక్టర్ రోగికి మంచి చేయాలనే చూస్తాడు. ఆవేశకావేశాలకు లోనై డాక్టర్లపై దాడి చేయడం హేయమైన చర్య. మహిళా డాక్టర్లు సురక్షితంగా ఉండాలంటే సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను విధిగా అమలు చేయాలి. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో సీసీ కెమెరాలు, పోలీస్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలి. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం వైద్య సేవలపై అసంతృప్తిగా ఉన్నవారు నిబంధనల మేరకు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేయాలి. అంతే కానీ భౌతిక దాడులకు దిగరాదు. ఇందుకు సంబంధించిన ఫోన్ నెంబర్లు కలిగిన బోర్డులను ప్రతి ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలి.

- డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ సివిల్ సర్జన్, పుత్తూరు

ప్రాణాలు పోసేవారికే రక్షణ కరువు

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని తమ మేధో శక్తితో బతికిస్తున్న దాక్టర్ల ప్రాణాలనే తీసేస్తుంటే సమాజం ఎటు వైపు పయనిస్తోందని పలువురు వైద్యులు ప్రశ్నిస్తున్నారు. డాక్టర్ల మానప్రాణాలకే రక్షణ లేకుంటే సగటు రోగిని రక్షించేదెవరని ప్రశ్నిస్తున్నారు. ఈ దుస్థితి నుంచి బయట పడాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను రూపొందించడంతోపాటు డాక్టర్ల రక్షణ చట్టాలను తక్షణం అమలు చేయాలని నినదిస్తున్నారు.

పుత్తూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్యోదంతం దేశ వ్యాప్తంగా ఉన్న డాక్టర్లను ఒక్కసారిగా కుదిపేసింది. వైద్య వృత్తిలో ఉంటే దేవుడిలా చూస్తారనే నమ్మకంతో వైద్య చదువులు చదువుతున్న ఎంతో మంది జూనియర్ డాక్టర్లు ఆత్మరక్షణలో పడిపోయారు. పలుచోట్ల వైద్యులు, వైద్య విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. నేటికీ ఆందోళనలు కొనసాగుతున్నాయి. హత్యకు గురైన జూనియర్ డాక్టర్‌కు న్యాయం చేయాలని, తమకు రక్షణ కల్పించాలంటూ పుత్తూరు డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.


పుత్తూరు వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి


వైద్య సేవల కోసం క్యూ కట్టిన రోగులు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైభవంగా ముగిసిన శ్రీకానగలమ్మ కొలుపు


ప్రత్యేక అలంకరణలో శ్రీకానగలమ్మ

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో వెలసి ఉన్న శ్రీకానగలమ్మ కొలుపు ఉత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మొక్కులున్న భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నంకొలుపులో భాగంగా హరికథా కాలక్షేపం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఉభయదారులు సారె సమర్పించారు. సారె పట్టువస్త్రాలు, పుష్పమాలికలతోపాటు విశేష ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అధ్యక్షుడు గురుమూర్తి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముందస్తు చికిత్సతో కంటి చూపు పదిలం


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనాథ్

పుత్తూరు: ముందస్తు చికిత్సల ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చునని ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి డాక్టర్ కె.శ్రీనాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంటి చూపు–జాగ్రత్తలు అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ వంశపారంపర్యంగా కంటి చూపు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. 40 ఏళ్లు దాటిన వారిలో క్యాటరాక్ట్ సమస్య సాధారణంగా మొదలవుతుందన్నారు. దీంతో కంటిలో ఒత్తిడి ఎక్కువ కావడంతో మెదడుకు వెళ్లే నరం దెబ్బతింటుందన్నారు. ముందస్తుగా క్యాటరాక్ట్‌కు చికిత్స తీసుకొంటే కంటి చూపు దెబ్బతినదని తెలిపారు. చిన్న పిల్లలు చదవడానికి, రాయడానికి ఇబ్బందిపడుతుంటే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే కంటి పరీక్షలు చేయించడం శ్రేయస్కరమన్నారు. అనంతరం డాక్టర్ శ్రీనాథ్‌ను వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాధామాధవుల చిత్రపటం ఊరేగింపు


పుష్పపల్లకిపై ఊరేగుతున్న రాధ, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడు

పాలసముద్రం: మండలంలోని పావుల్లూరు కండ్రిగ గ్రామస్తులు ఆదివారం రాధ, రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారికి పట్టాభిషేకం చేసి ఊరేగించారు. తొలుతపట్టాభిషేకానికి కావాల్సిన పూజా సామగ్రిన గ్రామ ప్రజలు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. సాయంత్రం వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.
సాయంత్రం పుష్ప పల్లకిపై రాధ, రుక్మిణీ సమేత శ్రీకృష్ణ స్వామివారి చిత్ర పటాన్ని ఉంచి బాణసంచా పేలుళ్ల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఊరేగింపు ముందు కోలాటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

31న ఉచిత వైద్యశిబిరం

కాణిపాకం: ఈనెల 31న బెంగళూరు వైదేహి హాస్పిటల్ వైద్యులు కాణిపాకంలోని దేవస్థాన ఆస్థాన మండపంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఈఓ వాణి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారన్నారు. భక్తులు, ఆలయ సిబ్బంది, గామస్తులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు


ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

పాలసముద్రం: ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోయినా, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ భారతి తెలిపారు. ఆదివారం రాచపాళెం గ్రామం వద్ద చిత్తూరు–బలిజకండ్రిగ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. పలు వాహనాలను నిలిపి, రికార్డులను పరిశీలించారు. వాహనాల రికార్డులు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా వేసుకుని వాహనాలు నడపాలని లేకుంటే జరిమానాలు వేస్తామని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి, డ్రైవర్లకు కౌన్సెలింగ్ చేశారు. ఆటోలు ఇష్టానుసారం నడుతున్నారని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి జరిమానా వేశారు.

లక్షాధికారులను చేయడమే లక్ష్యం


మహిళా సభ్యులకు చెక్కును అందజేస్తున్న అధికారులు

గుడిపాల: మహిళా సంఘాలను లక్షాధికారులను చేయడమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమన్నారు. ఆదివారం మోదీ గుడిపాల ఎంపీడీఓ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రధాని మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావడానికి లక్‌పత్ దీది పథకం ప్రధాన ఉద్దేశం అన్నారు. దీనివల్ల పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వారికున్న అవసరాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇందులోభాగంగా మండలంలోని 33 వీవోల ద్వారా 165 మందిని ఎంపిక చేసుకొని వారిని అభివృద్ధి చేయడం జరుగుతుందని ఇందిరా క్రాంతి ఏపీఎం సుధారాణి తెలిపారు. ఇందులో భాగంగా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాల కింద రూ.3కోట్ల 29లక్షలు మహిళా సంఘాలకు అందజేశారు. ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, విజయలక్ష్మి, వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలు ఆదాయం పెంచుకోవాలి


చెక్కుని అందిస్తున్న ఏపీఎం తదితరులు

పాలసముద్రం: డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, వివిధ పథకాల్లో తీసుకున్న నగదుతో ఆదాయం మెరుగు పరుచుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. ఆదివారం పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఆర్పీ, గ్రామ సమాఖ్య లక్పతి దీదీలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ మహిళలు సరైన జీవనోపాధి ఎంచుకుని సంవత్సర ఆదాయం లక్షకు మించి వచ్చేటట్టు ప్రణాళికలు చేపట్టాలన్నారు. మహిళ సంఘ సభ్యులు జీవన ప్రమాణాలు మెరుగు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు నెలలో బ్యాంకు ద్వారా 10 గ్రూపులకు ఒక కోటి ముప్పైఏడు లక్షలు మంజూరు చేశామని తెలిపారు. వీటిని సక్రమంగా ఆదాయం ఉపయోగించి స్వయం సుస్థిరత సాధించాలని తెలిపారు. వెలుగు కార్యాలయంలో ప్రధానమంత్రి లైవ్‌ప్రోగ్రామ్ వీక్షించారు. అనంతరం చెక్కులను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వాసు నాయుడు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

శరవేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు


రంగులు వేస్తున్న సిబ్బంది


లైట్లు వేస్తున్న సిబ్బంది

కాణిపాకం: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. స్వామివారి ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు. స్వామివారి రాజగోపురానికి, సుపథ మండపంలో, ఆలయం పరిసరాలలో ఎల్‌ఈడీ లైట్ల కటౌట్లు, విద్యుత్ ఎల్‌ఈడీ లైట్లు వెలుస్తున్నాయి. రంగులు వేసే పనులు శరవేగంగా సాగుతున్నాయి.

కరుణించని వరుణుడు


టి.పుత్తూరులో ఎండుతున్న వేరుశనగ పంట


దిగువమోదలపల్లె వద్ద ఎండుతున్న వేరుశనగ పంట

- ఖరీఫ్‌లో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతన్నలు

తవణంపల్లె: వరుణదేవుడు కరుణించకపోవడంతో చినుకులు నేలరాలక సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీనితో పంటలు సాగు చేసిన రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యం వల్ల అప్పులు చేసి కష్టపడి సాగు చేసిన పంటలు చేతికి వస్తాయో లేదో అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాధారం కింద ప్రధానంగా వేరుశనగ, కంది, అలసంద, అనప, జొన్న పంటలను సాగు చేశారు. కానీ సకాలంలో వర్షాలు పడకపోవడంతో మూడు విడతలుగా వేరుశనగ విత్తనాలు విత్తినారు. ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఆగస్టు మాసంలో మొదటి వారంలో వర్షాలు పడ్డాయి. 20 రోజులుగా వరుణదేవుడు కరుణించక చినుకులు పడకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు వరుణదేవుడు మొండి చెయ్యి చూపుతున్నాడు. మండలంలో 3,300 ఎకరాల్లో పంటలు సాగులో ఉండగా వేరుశనగ వెయ్యి ఎకరాల్లో సాగులో ఉంది. వేరుశనగ పంటలో మిశ్రమ పంటగా కంది, జొన్న, అనప, అలసంద పంటలు సాగులో ఉన్నాయి.

ఎండను తట్టుకోవడానికి యూరియా స్ప్రే చేయాలి

ఖరీఫ్ సాగు చేసి వర్షాభావంతో ఎండుతున్న పంటలకు రైతులు యూరియా ఎరువును 50 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఎండ తీవ్రతకు పంట తట్టుకుంటుందని మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో వర్షాలు పడ్డాయి. తర్వాత వర్షాలుపడనందున అక్కడక్కడ వేరుశనగ పంట వాడుముఖం పడుతోందని వివరించారు.

–వ్యవసాయాధికారి ప్రవీణ్

అనుమతిలేకుండా టపాసుల విక్రయం

–ఒకరిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్: నగరంలో అనుమతి లేకుండా టపాకాయలు విక్రయిస్తున్న వ్యక్తిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలాంటి లైసెన్సు లేకుండా బజారువీధిలోని ఓ దుకాణంలో టపాకాయలు విక్రయిస్తున్నట్లు గుర్తించామని టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు. ఇక్కడ రూ.14 వేలు విలువ చేసే బాణాసంచా స్వాధీనం చేసకుని, దుకాణం నిర్వాహకుడు రవిచంద్రశెట్టిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కృష్ణయ్యకు ఆహ్వానం

- నేడు శ్రీకృష్ణాష్టమి పండుగ
- ముస్తాబవుతున్న శ్రీకృష్ణుని ఆలయాలు


పాతర్కాడులో శ్రీకృష్ణుని ఆలయం

విజయపురం: శ్రావణ మాసం వచ్చిందంటే చాలు అన్నీ పండుగలే. ముఖ్యంగా మహిళలు అత్యంత ఇష్టంగా భావించే మాసం శ్రావణం. ఈ మాసంలోనే భక్తులు శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. నేడు శ్రీకృష్ణపరమాత్మ పుట్టిన శుభదినమే శ్రీకృష్ణాష్టమి. కొందరు దీనినే శ్రీకృష్ణ జన్మాష్టమి అని కూడా అంటారు. మరి కొంత మంది గోకులాష్టమి, శ్రీకృష్ణ జయంతిగా కూడా పిలుస్తారు. నేడు శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా భక్తులు సంబరాలకు సిద్ధమయ్యారు.

బుడి బుడి అడుగులతో...

శ్రీకృష్ణాష్టమి రోజు బుడి బుడి అడుగుల బుడతడు అయిన కృష్ణయ్య అందరి ఇళ్లకు వస్తారని భక్తుల నమ్మకం. ప్రతి ఇంట్లో తల్లులంతా దేవకి, యశోదలుగా భావించుకుంటూ, తమ బిడ్డలను శ్రీకృష్ణుడి రూపంలో అలంకరించి వేడుకలు నిర్వహిస్తారు. సంతానలేమితో బాధపడే వారు శ్రీకృష్ణుని పూజిస్తే బుజ్జి కృష్ణుడు పుడుతారని నమ్ముతారు.

ఇంటింటా సందడి

శ్రీ కృష్ణాష్టమి వచ్చిందంటే చాలు.. ప్రతి ఇంటా సందడే. గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి, ఇంటి గడపలను పసుపు, కుంకుమలతో అలంకరించి కృష్ణుడి పాదాలు వేస్తారు. తెలుగు రాష్ట్రాలలో ఎక్కువగా వెన్న, పాలు, పెరుగు, బెల్లం, శనగ పప్పు వంటి వాటిని కృష్ణుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఇంటిలోకి వస్తున్నట్టు పాద ముద్రలు వేసి ఆహ్వానిస్తారు. అలాగే కృష్ణుడికి అత్యంత ఇష్టమైన వెన్న సమర్పించి, ఉయ్యాలలో విగ్రహాన్ని ఉంచి లాలి పాట పాడుతూ ఊయల ఊపుతూ భక్తిని చాటుకుంటారు.

గ్రామాల్లో ఉట్టి కొట్టే సంబరం

శ్రీకృష్ణాష్టమి వచ్చిందంటే చాలా నగరాలు, గ్రామాల్లో ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. శ్రీకృష్ణాష్టమి రోజు సాయంత్రం ఉట్టి కొట్టే పోటీలు జోరుగా సాగుతాయి. దీనికోసం ఇంటింటికీ వెళ్లి మట్టికుండలో పెరుగు, పాలు, చిల్లర డబ్బులు, సేకరించి దానిని ఉట్టిలో పెడుతారు. ఆ తర్వాత పొడవైన తాడుతో ఉట్టిని కట్టి కిందకు పైకి లాగుతూ ఉంటారు. ఆ ఉట్టిని పగలగొట్టడానికికి యువకులు పోటీపడడం ఉత్సాహాన్ని కలిగిస్తుంది. రంగులు కలిపిన వసంత నీళ్లు పోస్తూ ఉంటే యువత ఉట్టి కొట్టడానికి చూపించే ఉత్సాహం అందరిలో ఆనందం వెల్లివిరిసేలా చేస్తుంది.